WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 05 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 5 జనవరి 2026 | వెల : 2-00

# విజన్ వైజాగ్‌లో కీలక అడుగు




- భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో తొలి విమానం ల్యాండింగ్
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ హర్షం
- ఏపీ అభివృద్ధి మార్గంలో ఒక మైలు రాయి.. మా పాలనలో వేగవంతమైన అనుమతులు.. గణనీయమైన భాగం అప్పుడే పూర్తి
- పునరావాసం, భూసేకరణ కోసం సుమారు రూ.960 కోట్ల ఖర్చు
- ఆ కృషే ఇవాల్టి కీలక మైలు రాయిని చేరేందుకు ముఖ్య కారణం

**అమరావతి, స్వర్ణసాగరం**

విశాఖపట్నంలో కొత్తగా నిర్మించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో తొలి విమానం ల్యాండింగ్ కావడంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విమానాశ్రయం ఏర్పాటు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు సాధించడంతో పాటు ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయిందన్నారు. 'విశాఖపట్నంలో కొత్తగా నిర్మించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో తొలి విమానం ల్యాండింగ్ కావడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మార్గంలో ఒక మైలు రాయి విజన్ వైజాగ్ లక్ష్యాన్ని సాధించే దిశగా కీలక అడుగు పడింది. మా పాలనా కాలంలో వేగవంతమైన అనుముతులు సాధించడమే కాదు.. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన వారి పునరావాసం కోసం, భూసేకరణ కోసం సుమారు రూ.960 కోట్లు ఖర్చు చేశాం. తద్వారా ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేశాం. ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. - మిగతా3లో

## 'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం



- అండర్-17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చింది
- 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయి
- 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది

2

## నేడు 'స్వచ్ఛ సంక్రాంతి' గ్రామసభలు

- రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు
- 26 నుంచి ఈ నెల 4వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు
- ఈ కార్యక్రమం చివరి నాటికి గ్రామ పంచాయతీల్లోని నాడెప్ తొట్టెలన్నీ తడి చెత్తతో నింపుతారు



**అమరావతి, స్వర్ణసాగరం**

'స్వచ్ఛ సంక్రాంతి-స్వచ్ఛ గ్రామ పంచాయతీలు' అనే కార్యక్రమానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. పంచాయతీల్లో శాస్త్రీయ విధానంలో ఘనవ్యర్థాల నిర్వహణను అమలు చేసి.. చెత్తరహిత, పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 'స్వచ్ఛ సంక్రాంతి-స్వచ్ఛ గ్రామ పంచాయతీలు-2026' ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గత డిసెంబరు 26 నుంచి ఈ నెల 4వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు ఈనెల 10 వరకు పొడిగించారు. ఈ కార్యక్రమం చివరి నాటికి గ్రామ పంచాయతీల్లోని నాడెప్ తొట్టెలన్నీ తడి చెత్తతో నింపుతారు. ఈ కార్యక్రమం కొనసాగింపుగా, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను శుభ్రంగా - మిగతా3లో



## ఓట్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారు

- ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులనే దెబ్బతీస్తున్నారు
- ఎస్ఐఆర్‌ను ఆపేయాలి లేదా తప్పులను సరిదిద్దాలి
- పొరపాట్లకు ఈసీయే పూర్తి బాధ్యత వహించాలి
- సీఈసీకి రాసిన లేఖలో సీఎం మమత డిమాండ్

2

## అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం!



- కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీకి ప్రియాంక గాంధీ సారథ్యం
- అసోం అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ సన్నద్ధం
- ప్రియాంక గాంధీ సారథ్యంలో అభ్యర్థుల ఎంపిక
- అసోం, బంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి కోసం కమిటీలు ఏర్పాటు


3



## తమిళనాట '20% కమీషన్ల' పాలన

- విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతోంది
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేదే విజయం
- బీజేపీ అగ్రనేత అమిత్ షా ధీమా
- కుటుంబ రాజకీయాలకు ఇక చరమగీతం

# యువత చేతిలో ఉపాధి సృష్టి





విమానాశ్రయంలో విమాన ల్యాండింగ్ విజయవంతం

- ప్రపంచ అగ్రశేణి నగరిగా మారుతుంది
- త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**విజయనగరం, స్వర్ణసాగరం**

విజయనగరం జిల్లాలోని భోగాపురం ప్రాంతం ప్రపంచ అగ్రశేణి నగరిగా త్వరలో మారబోతోందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శంషాబాద్, ఢిల్లీ విమానాశ్రయాలకు దీటుగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందన్నారు. ఇక్కడ రన్‌వేపై విమాన ల్యాండింగ్ పరీక్ష నిర్వహణకు ఢిల్లీ నుంచి ఆదివారం ఆయన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో - మిగతా3లో

## జూన్ నాటికి విమానాశ్రయం సిద్ధం సీఎం చంద్రబాబు

**అమరావతి, స్వర్ణసాగరం**

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి విమాన ల్యాండింగ్ విజయవంతం కావడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు - మిగతా3లో

# ఓట్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారు

**కోల్‌కతా**

పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియపై సీఎం మమతా బెనర్జీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే భారీగా ఓట్లు తొలగింపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. అదే జరిగితే, ప్రజాస్వామ్య పునాదులపైనే దెబ్బకొట్టినట్లవుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏకపక్షంగా, తప్పులతడకగా కొనసాగుతున్న ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. ఈ మేరకు ఆమె తాజాగా ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు మరో లేఖ రాశారు. ఎటువంటి ప్రణాళిక, సన్నద్ధత లేకుండా ఎన్నికల కమిషన్ హడావుడిగా చేపట్టిన ఎస్ఐఆర్‌తో తీవ్రమైన అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలు, పరిపాలనాపరమైన తప్పిదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నవంబర్ 20, డిసెంబర్ 2వ తేదీల్లో రాసిన లేఖలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో మరిన్ని ఘోరమైన తప్పిదాలకు తావిచ్చినట్లయిందని మమత ఆరోపించారు.

**సరైన శిక్షణ ఇవ్వలేదు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న అధికారులకు సరైన శిక్షణ లేదని, ఓటర్ల జాబితా సవరణకు వాడుతున్న



సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యవస్థలు సరైనవి కావని సీఎం మమత పేర్కొన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందికి సరైన, ఒకే విధమైన శిక్షణ ఇవ్వలేదని ఆరోపించారు. అంతేకాదు, ఎన్నికల సంఘం జారీ చేస్తున్న ఆదేశాలలో స్పష్టత కూడా లేదన్నారు. పరస్పర విరుద్ధ ఆదేశాల కారణంగా క్షేత్రస్థాయి సిబ్బందిలో గందరగోళం నెలకొందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రణాళికా లోపం వల్ల ఈ కీలకమైన ప్రజాస్వామ్య ప్రక్రియ ఒక ప్రహసనంగా మారిందని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తన అభ్యంతరాలను ఇకపై అయినా పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తూ మరోసారి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

**ఐటీ వ్యవస్థల దుర్వినియోగం**

ఓటర్ల నమోదు అధికారు(ఈఆర్‌వో)లకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండానే ఐటి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి మమత ఆరోపించారు. దీనివల్ల అర్హులైన ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఓటు తొలగించాలంటే చట్టపరమైన నిబంధనలు పాటించాలి, కానీ ఇక్కడ ఆ సరైన ప్రక్రియ అమలుకు నోచుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తొలగింపులకు ఎవరు అనుమతి ఇచ్చారు? ఏ చట్టపరమైన అధికారం కింద ఇవి జరుగుతున్నాయి? అని ప్రశ్నించారు. ఈ మొత్తం ప్రక్రియ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే జరుగుతోంది కాబట్టి, ఎటువంటి అక్రమ, ఏకపక్ష, పక్షపాత చర్యలకైనా ఎన్నికల కమిషనే పూర్తి బాధ్యత వహించాలని మమత స్పష్టం చేశారు.

# వెనెజువెలాలో పరిస్థితులు ఆందోళనకరం

వెనెజువెలాలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ తెలిపింది. అమెరికా దాడులు, తదితర పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొంది. వెనెజువెలా ప్రజల శ్రేయస్సు, భద్రతకు భారత్ తన మద్దతు కొనసాగిస్తుందని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. 'వెనిజువెలాలో ఇటీవల జరిగిన పరిణామాలు తీవ్రమైన ఆందోళనకు కారణమవుతున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో మేం దగ్గరగా గమనిస్తున్నాం. వెనిజువెలా సంక్షోభంలో భాగమైన అన్ని పక్షాలు చర్చలు, దౌత్య మార్గాలను ఆశ్రయించాలి. వెనిజువెలా ప్రజల భద్రత, సంక్షేమానికి భారత్ మద్దతు ఇస్తోంది. ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొనేలా సమస్యలను సంభాషణల ద్వారా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అన్ని పక్షాలను కోరుతున్నాం' అని విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రవాస భారతీయులతో సంప్రదింపులు జరుపుతోందని విదేశాంగ శాఖ పేర్కొంది. సాధ్యమైన సహాయాన్ని అందించేందుకు రాయబార కార్యాలయం సిద్ధంగా ఉందని తెలిపింది.

**అనవసర ప్రయాణాలు వద్దు**

భారతీయులకు విదేశాంగ శాఖ హెచ్చరిక జారీ చేసింది. వెనెజువెలాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, శనివారం కీలక సూచనలు జారీ చేసింది. వెనెజువెలాకు అనవసర ప్రయాణాలు పూర్తిగా నివారించాలని భారతీయ పౌరులను కోరింది. అలాగే ఇప్పటికే అక్కడ ఉన్న భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను తగ్గించాలని సూచించింది. కారాకాస్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులో ఉండాలి తెలిపింది

**మదురో వెంటనే విడుదల చేయాలి : చైనా**

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను వెంటనే విడుదల చేయాలని అమెరికాను చైనా కోరింది. వెనెజువెలా ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రక్రియను ఆపాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని అమెరికాకు బీజింగ్ సూచించింది. అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలు, ప్రాథమిక నిబంధనలను, ఐరాస




చార్టర్ సూత్రాల్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. లాటిన్ అమెరికా, కరేబియన్ లలో శాంతి, భద్రతలకు ముప్పు కలిగించే అమెరికా ఆధిపత్య ప్రవర్తనను చైనా గట్టిగా వ్యతిరేకిస్తుందని పేర్కొంది. అమెరికా నిర్ణయాన్ని ప్రమాదకర ఉదాహరణగా అభివర్ణించిన ఐరాస సోమవారం భద్రతా మండలి సమావేశం కావాలని కోరింది. మదురోను బంధించిన అమెరికా ఇప్పటికే ఆయనను న్యూయార్క్‌ను తరలించింది. న్యూయార్క్ నగరంలోని డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేంద్రానికి (డీఈఏ) మదురోను తరలించారు. మదురో చేతులకు సంకెళ్లతో ఉన్న దృశ్యాలను అమెరికా విడుదల చేసింది. అందులో మదురోను ఇద్దరు అధికారులు డీఈఏ తరలిస్తున్నట్లుగా ఉంది. తర్వాత మదురోను న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్ (ఎండీసీ)కు తరలించనున్నట్లుగా తెలుస్తోంది.

మరోవైపు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌ను నియమిస్తున్నట్లు ఆ దేశ సుప్రీం కోర్టు ప్రకటించింది. ప్రభుత్వ పరిపాలనా కొనసాగింపు, దేశ రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు, వామపక్ష గెరిల్లా నాయకుడు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన డెల్సీ రోడ్రిగ్స్. ఆమె 1969లో వెనెజువెలా రాజధాని కారకాస్‌లో జన్మించారు. మదురో ప్రభుత్వంలో ఆమె కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 2018లో ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఉపాధ్యక్షురాలి స్థానంతో పాటు ఆర్థిక, చమురు మంత్రిత్వ శాఖల మంత్రిగా కొనసాగారు. వెనెజువెలాలోని చమురు కోసం ట్రంప్ సుంకాల విధించిన వేళ దేశాన్ని ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. మదురోకు విశ్వసనీయురాలిగా పేరు తెచ్చుకున్నారు.

# గుర్మీత్ రామ్ రహీమ్‌కు మళ్లీ పెరోల్- 6 ఏళ్లలో 15వ సారి బయటకి!

అత్యాచారం, హత్య వంటి తీవ్రమైన నేరాల్లో దోషిగా తేలి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి జైలు నుంచి బయటకు వచ్చారు. తాజాగా ఆయనకు మరో 40 రోజుల పెరోల్ మంజూరు చేసింది హరియాణా ప్రభుత్వం. గడిచిన ఆరేళ్లలో (2020 నుంచి) ఆయనకు జైలు నుంచి తాత్కాలిక ఊరట లభించడం ఇది 15వ సారి కావడం గమనార్హం. అయితే రామ్ రహీమ్‌కు జైలు గేట్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు తెరుచుకుంటున్నాయని సిక్కు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**15వ సారి విడుదల, ఇదీ లెక్క**

రోహ్‌తక్‌లోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్న రామ్ రహీమ్, తరచూ పెరోల్‌పై బయటకు వస్తున్నారు. ప్రస్తుతం 40 రోజుల పెరోల్ మంజూరైంది. గత ఏడాది ఆగస్టులో కూడా ఆయనకు 40 రోజుల పెరోల్ ఇచ్చారు. అంతకుముందు ఏప్రిల్‌లో 21 రోజుల బెయిల్‌పై బయటకు వచ్చారు. గత ఏడాది జనవరిలో 30 రోజుల పెరోల్ తీసుకున్నారు. ఇలా 2020 నుంచి ఇప్పటివరకు మొత్తం 15 సార్లు ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు.

**గతంలో ఎన్నికల టైమింగ్‌లోనే**

ఇప్పుడు ఎన్నికలు లేనప్పటికీ, గతంలో ఆయన విడుదలైన సమయాలను పరిశీలిస్తే, అవి కచ్చితంగా ఎన్నికల కోసమేనన్న విమర్శలు ఉన్నాయి. గత ఏడాది (2025) ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలకు ముందు, జనవరిలో ఆయనకు 30 రోజుల



పెరోల్ లభించింది. 2024 అక్టోబర్ 5న హరియాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దానికి సరిగ్గా నాలుగు రోజుల ముందు (అక్టోబర్ 1న) ఆయన 20 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చారు. 2022 ఫిబ్రవరిలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు కూడా ఆయనకు మూడు వారాల బెయిల్ లభించింది. ఇలా కీలకమైన ప్రతి ఎన్నికల సమయంలోనూ ఆయన బయట ఉంటూ ఓటు బ్యాంకును ప్రభావితం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

**నేర చరిత్ర ఇదీ**

గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ నేపథ్యం నేరమయమైంది. ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నది సాధారణ కేసుల్లో కాదు. తన ఆశ్రమంలోని ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచారం చేసిన కేసులో 2017లో కోర్టు ఆయనకు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే 16 ఏళ్ల క్రితం ఒక జర్నలిస్టును హత్య చేసిన కేసులో కూడా 2019లో ఆయన దోషిగా తేలారు. డేరా చీఫ్‌తో పాటు మరో ముగ్గురికి ఈ హత్య కేసులో శిక్ష పడింది.

**యూపీ ఆశ్రమంలోనే మకాం**

జైలు నుంచి బయటకు వచ్చిన ప్రతిసారీ ఆయన తన ప్రధాన కేంద్రమైన హరియాణలోని సిర్సాకు వెళ్లడం మానేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌శ్రీపత్ జిల్లాలో ఉన్న డేరాకు చెందిన 'బర్నావా ఆశ్రమం'లో గడుపుతారు. గతంలో బయటకు వచ్చిన 13 సందర్భాల్లో ఆయన ఎక్కువ రోజులు అక్కడే ఉన్నారు. హరియాణ, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో డేరాకు భారీ సంఖ్యలో అనుచరులు ఉన్నారు. సిర్సా, ఫతేహాబాద్, కురుక్షేత్ర, కైథాల్, హిసార్ జిల్లాల్లో ఆయన ప్రభావం ఎక్కువ.

**చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు**

హరియాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ వంటి సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తీవ్రమైన నేరాలు చేసిన వ్యక్తికి ఇన్ని సార్లు పెరోల్ ఇవ్వడం చట్టాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడుతున్నాయి. ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే దోషులను కాపాడుతోందని విమర్శిస్తున్నాయి.

## తమిళనాట '20% కమీషన్ల' పాలన

**స్వర్ణసాగరం పుదుకొట్టై**

తమిళనాడులో డీఎంకే పాలనలో అవినీతి విచ్చలవిడిగా రాజ్యమేలుతోందని కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా మండిపడ్డారు. రాష్ట్రంలో '20 శాతం కమీషన్ల' పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రతి పనిలో 20 శాతం కమీషన్లు నొక్కేస్తున్నారని, ఇదొక నిబంధనగా మారిపోయిందని షా దుయ్యబట్టారు. తమిళనాడుతోపాటు పశ్చిమ బెంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయనార్ నాగరత్నన్ చేపట్టిన యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం పుదుకొట్టైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం తమిళనాడులో ఉందన్నారు. తమిళ భాషను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. తమిళాన్ని మరింత ప్రోత్సహించడానికి పలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో హిందుమతాన్ని, హిందువులను డీఎంకే తరచుగా కించపరుస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరియాణా, ఢిల్లీ, బిహార్ తరితర రాష్ట్రాల్లో ఎన్డీయే ఘన విజయం సాధించిందని, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లోనూ అదే ఫలితం పునరావృతం కాబోతోందని స్పష్టంచేశారు.

కుటుంబ రాజకీయాలకు ఇక చరమగీతం

తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ దారుణంగా విఫలమైందని అమిత్ షా మండిపడ్డారు. ఆ పార్టీ అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. క్యాష్ ఫర్ జాబ్స్‌తోపాటు మనీ లాండరింగ్ కేసుల్లో డీఎంకే నాయకుల పేర్లు తెరపైకి వచ్చాయని గుర్తుచేశారు. అవినీతి నేతలుండగా రాష్ట్రం ప్రగతి సాధించడం సాధ్యం కాదని అన్నారు. అప్పులు, మద్యం ఆదాయంతోనే ప్రభుత్వం నడిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సీఎం స్టాలిన్ ఆరాటపడుతున్నారని, ఆయన ఆశ నెరవేరే ప్రసక్తే లేదని అమిత్ షా పేర్కొన్నారు. కుటుంబ రాజకీయాలకు చరమగీతం పాడే సమయం వచ్చిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించని స్టాలిన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. డీఎంకే నాయకులు సనాతన ధర్మాన్ని మలేరియా, డెంగ్యూతో పోలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందువుల పండుగలకు సైతం అనుమతి ఇవ్వడం లేదన్నారు. హిందువులపై దాడులు జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి స్టాలిన్ రాజ్యాంగ విలువలను ఉల్లంఘిస్తున్నారని అమిత్ షా ధ్వజమెత్తారు.

## 'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం

'ఒలింపిక్స్-2036 క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని ప్రధాని గుర్తుచేశారు. అండర్-17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు.

భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ క్రీడతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామని చెప్పారు. కాగా జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యి మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు చెబుతున్నారు.

## మోదీజీ.. ట్రంప్ చేసినప్పుడు మీరెందుకు చేయలేరు.. వెనెజువెలా ఘటనపై ఒవైసీ రియాక్షన్!

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన ఘటనపై ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వెనెజువెలాలో సైనిక చర్యలు చేపట్టి అక్కడి అధ్యక్షుడినే బంధించినప్పుడు.. మీరు పాకిస్థాన్‌కు వెళ్లి 26/11 ఉగ్రదాడికి పాల్పడిన మాస్టర్‌మైండ్స్‌ను పట్టుకురావచ్చు కదా అని ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ట్రంప్ చేసినప్పుడు మీరెందుకు చేయలేరని ప్రశ్నించారు. మోదీజీ.. ముంబై దాడులకు కుట్రలు పన్నిన క్రూరులు.. అది మసూద్ అజర్ అయినా సరే.. లష్కరే తోయిబా ఉగ్రవాదులైనా సరే పాకిస్థాన్ నుంచి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక నియంత్రణతో కూడిన విధానాన్ని అనుసరిస్తుందని బీజేపీ ఎంపీ గులాం అలీ ఖటానా తెలిపారు. ప్రధాని మోదీ పాలనలో ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకుంటాం తప్ప.. దేశాలను కాదని స్పష్టం చేశారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని.. మనం పొరుగు దేశాలు చిన్నవైనా, పెద్దవైనా వాటితో స్నేహపూర్వకంగానే ఉండటం మన బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రభావితం కావడం లేదని చెప్పారు. బిహార్ మంత్రి దిలీప్ జైస్వాల్ కూడా ఒవైసీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒవైసీ ఎప్పుడూ హెడ్‌లైన్లలో రావాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇప్పుడు ఒవైసీ ట్రంప్‌నకు కూడా సలహాలు ఇస్తున్నారని.. ఆయన సలహాలను ట్రంప్ కూడా పరిగణనలోకి తీసుకుంటాడేమో అని సెటైర్లు వేశారు.

## రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం.. 200కు పైగా వాహనాలు దగ్ధం

తిరువనంతపురం: రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పార్కింగ్ స్థలంలో ఉన్న 200కు పైగా ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. మంటలు, దట్టమైన పొగలు చూసి రైల్వే అధికారులు, ప్రయాణికులు, సమీపంలోని నివాసితులు భయాందోళన చెందారు. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. కేరళలోని త్రిస్సూర్ రైల్వే స్టేషన్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో ప్లాట్‌ఫామ్ నంబర్ 2 సమీపంలోని ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ ఉండటంతో మంటలు మరింతగా ఎగిసిపడ్డాయి. దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో రైలు ప్రయాణికులు, అధికారులు, సమీపంలోని నివాసితులు ఈ మంటలు చూసి భయాందోళన చెందారు. కాగా, అగ్నిప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అర గంట పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న సుమారు 200కు పైగా ద్విచక్ర వాహనాలు కాలిపోయినట్లు గుర్తించారు. మరోవైపు ఈ అగ్ని ప్రమాదానికి కారణంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఈ సంఘటన వల్ల రైలు సేవలు ప్రభావితం కాలేదని రైల్వే అధికారులు తెలిపారు.

# ‘రీ సర్వే’పై దోబూచులాట!

స్వర్ణసాగరం అమరావతి

భూముల తల రాతను మార్చేలా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన భూముల రీ సర్వేను చంద్రబాబు ప్రభుత్వం సక్రమంగా చేయలేక సతమతమవుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఒక్క గ్రామంలోనూ రీ సర్వే పూర్తి చేయలేకపోయింది. గత జగన్ ప్రభుత్వం 8 వేలకుపైగా గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, అక్కడ డిజిటల్ రికార్డులను అందుబాటులోకి తెచ్చింది. అధికారంలోకి రాకముందు ఆ రీ సర్వేపై ఇష్టానుసారం ఆరోపణలు చేసి.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన చంద్రబాబు, ఆ తర్వాత యూటర్న్ తీసుకున్న విషయం తెలిసిందే. రీ సర్వే మంచిదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో తాను అభాండాలు వేసిన దాన్ని రద్దు చేయలేక కొన్నాళ్లు డ్రామాలతో కాలక్షేపం చేశారు. ఈ నేపథ్యంలోనే జగన్ హయాంలో జరిగిన రీ సర్వే దేశానికే రోల్ మోడల్‌గా ఉన్నట్లు చెప్పడం, రీ సర్వే చేసిన రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్రం ప్రకటించడంతో.. రీ సర్వేలో తప్పులు సరి చేస్తామంటూ చంద్రబాబు కొత్తపాట పాడారు. మరోవైపు జగన్ హయాంలో 8 వేలకుపైగా గ్రామాల్లో పూర్తయిన రీ సర్వేను చూపించి కేంద్రం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకంగా రూ.400 కోట్ల నిధులు తెచ్చుకున్నారు. అయినా ఆ నిధులను రీ సర్వే కోసం ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు మళ్లించారు. కనీసం రెవెన్యూ శాఖకు కొన్ని నిధులైనా ఇవ్వాలని ఆ శాఖ కోరినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు.



**సౌకర్యాలు లేవు.. సిబ్బందికి ఇతర పనులు**

రీ సర్వే చేసే బృందాలకు అవసరమైన కంప్యూటర్లు, రోవర్లు ఇవ్వకుండా రీ సర్వే చేయాలని ఒత్తిడి చేశారు. రెవెన్యూ యంత్రాంగానికి సర్వే చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించకుండానే సర్వే చేయాలంటూ మొక్కుబడి తంతు నడిపారు. మరోవైపు వీఆర్‌ఓలు, సర్వేయర్లకు ఇతర పనులు అప్పగించడంతో రీ సర్వే ముందుకు సాగలేదు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా నిరంతరం చేపట్టే అభిప్రాయ సేకరణ సర్వేలు, పింఛన్ల పంపిణీ తదితర పనుల కోసం వారిని పెద్ద ఎత్తున వినియోగించారు. ప్రధాని పర్యటనలు, యోగా డే ఇతర కార్యక్రమాల పనులన్నీ వారికే అప్పగించారు. ఆ పనుల్ని ఎంపీడీఓలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు వారిపై ఒత్తిడి తెచ్చారు. ఆ సమయంలో రీ సర్వే చేయాలని రెవెన్యూ శాఖ చెప్పినా దాంతో తమకు సంబంధం లేదని, తాము చెప్పిన పని చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. తహశీల్దార్లకు సైతం రెవెన్యూ పనులు చాలా ఉండడంతో రీ సర్వే గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఫలితంగా ఏడాదిన్నరలో ఒక్క గ్రామంలో కూడా రీ సర్వే పూర్తి చేయలేకపోయారు.

**రీ సర్వేలో మొదటి స్థానం ఎవరి ఘనత?**

గతంలో రీ సర్వే ప్రారంభమైన వెంటనే 19 నోటిఫికేషన్ ఇచ్చే ముందే ఆయా భూములకు సంబంధించిన రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించే వారు. వారి రికార్డులు చూసేవారు. ఇప్పుడు అలా కాకుండా సర్వే అయిపోయాక రైతుల అభిప్రాయాలు తీసుకోవాలనే విధానాన్ని తెచ్చారు. దీంతో తప్పులు వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో ఇటీవలే తప్పులు సరి చేయడానికి అవకాశం కల్పించారు. ఈ క్రమంలో రీ సర్వేలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని కేంద్ర మంతి పెమ్మసాని ప్రకటించారు. చంద్రబాబు ప్రభుత్వం ఒక్క గ్రామంలో కూడా సర్వే పూర్తి చేయకుండా ఏపీ ఎలా నంబర్ వన్‌గా నిలిచిందన్న దానికి ఆయన వద్ద సమాధానం లేదు. వైఎస్ జగన్ హయాయిలో విజయవంతంగా రీ సర్వే జరగడం, 8 వేలకుపైగా గ్రామాల్లో సర్వే పూర్తయి కొత్త డిజిటల్ రికార్డులు అందుబాటులోకి రావడం వల్లే ఇది సాధ్యమైంది. రీ సర్వేకు ప్రోత్సాహకంగా వచ్చిన రూ.400 కోట్లు ఇతర అవసరాలకు ఖర్చు పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం రీ సర్వేను మాత్రం వైఎస్ జగన్ ప్రభుత్వ తరహాలో విజయవంతంగా కొనసాగించలేకపోతోంది.

# యువత చేతిలో ఉపాధి సృష్టి

-మొదటిపేజీ తరువాయి

వచ్చారు. ఈ విమానం విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. అనంతరం రామ్మోహన్‌నాయుడు అక్కడ మాట్లాడారు. ‘ఈ ప్రక్రియ విజయవంతం అయిందంటే ప్రాజెక్ట్ నిర్మాణం చివరి దశకు చేరుకున్నట్లే. దీనివల్ల అంతర్జాతీయ నగరాలతో అనుసంధానం ఏర్పడుతుంది. స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి కల్పన, వ్యవసాయ, ఆహారోత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. నాలుగైదు నెలల్లో పూర్తిగా సిద్ధమయ్యాక ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో 18 నెలల్లో పనులు వేగంగా చేయగలిగాం” అని తెలిపారు.




భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోందని రామ్మోహన్‌నాయుడు అన్నారు విశాఖ. ‘ఈ ప్రాంతాన్ని ఆర్థిక నడవాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రణాళికలు అమలు చేస్తోంది. యువత ఉపాధి అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం లేదు.. సృష్టించుకోవచ్చు. ఇక్కడ విమానాల నిర్వహణ, మరమ్మతుల కేంద్రాన్ని (ఎంఆర్ఐ) దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియాలోని ఎంఆర్ఐ కేంద్రాలకు దీటుగా అన్ని హంగులు కల్పిస్తాం. జీఎంఆర్–మాన్సాస్ సంయుక్త భాగస్వామ్యంతో సమీపంలోని అన్నవరం వద్ద 136 ఎకరాల్లో ఎడ్యూ సిటీ అవతరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయానికి ఇచ్చిన 2,203 ఎకరాలకు అదనంగా అందజేసిన 500 ఎకరాల్లో వివిధ విమానయాన అనుబంధ విభాగాలు వెలుస్తాయి’ అని చెప్పారు.

**18 నెలల్లో ఇదో రికార్డు**

కూటమి అధికారంలోకి వచ్చినప్పటికి ఇక్కడ 23% పనులే జరిగాయని మంత్రి పేర్కొన్నారు. 18 నెలల్లో 96% పూర్తి చేసుకొని దేశంలో వేగంగా విమానాశ్రయ నిర్మాణం చేపట్టడంలో రికార్డు నెలకొల్పిందన్నారు. దేశంలో స్టార్ ఎయిర్ సంస్థ మళ్లీ రంగప్రవేశం చేయనుందని తెలిపారు. త్వరలో నవీ ముంబయి, నోయిడా విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

**సరకు రవాణాకు అనుకూలం**

ఈ విమానాశ్రయం ఫార్మా, ఆక్వా ఉత్పత్తుల రవాణా, ఎగుమతులకు అనుకూలమని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం ఏటా ఐదారు వేల టన్నుల సరకు రవాణా చేస్తారని, క్రమంగా 20 వేల టన్నులకు పెరుగుతుందని చెప్పారు. ఇక్కడి నుంచి పశ్చిమాసియా, తూర్పు ఆసియా దేశాలకు ఎక్కువ కనెక్టివిటీ పెంచేలా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి 33 విమాన సర్వీసులు నడుస్తున్నాయని, భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక స్వదేశీ, విదేశీ సర్వీసులు రెట్టింపు అవుతాయన్నారు.

**బీచ్ కారిడార్‌పై కేంద్రంతో చర్చలు**

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా బీచ్ కారిడార్ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో పోర్టు నిర్మాణం జరుగుతోందని, అక్కడకు సమీపంలో ఎయిర్‌పోర్టు ఉండాలనే లక్ష్యంతో పలాసలో విమానాశ్రయం నిర్మించాలని యోచిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు, పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మరచిపోలేని క్షణాలివి రామ్మోహన్‌నాయుడు**

‘ఎయిర్ ఇండియా విమానంలో ఆదివారం ఉదయం 8.45 గంటలకు దిల్లీలో బయలుదేరాను. 11 గంటలకు గగనతలంలో ఉండగా మరికొద్దిసేపట్లో భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కానున్నట్లు పైలట్ చేసిన ప్రకటన వినగానే పరవశించిపోయాను. నా చెవిలో ఇప్పటికీ ఆ మాటలు మార్మోగుతున్నాయి. ఆ ఆనందం వర్ణనాతీతం. మరచిపోలేని క్షణాలవి” అని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉదయం 11.01 గంటలకు రన్‌వేపై దిగిన విమానం 11.04 గంటలకు ఏరోబ్రిడ్జి వద్దకు చేరింది. ఆ సమయంలో విమానానికి వాటర్ సెల్యూట్ చేశారు. విమానం ఆగిన తర్వాత అందులోంచి మంత్రి రామ్మోహన్‌నాయుడు బయటకు వచ్చి అందరికీ అభివాదం చేశారు. ఆయనతోపాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉన్నారు. స్థానిక నాయకులు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, విజయనగరం, విశాఖపట్నం కలెక్టర్లు ఎం.రాంసుందర్‌రెడ్డి, హరేంధిరప్రసాద్, కూటమి పార్టీల నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

## ‘నేతన్న భరోసా’ ఏమైంది బాబూ!

స్వర్ణసాగరం అమరావతి

చేనేత రంగానికి చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని చేనేత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఏడాదికి రూ.25 వేల చొప్పున నేతన్న భరోసా పథకం కింద చంద్రబాబు ప్రభుత్వం అందించాలని, చేనేత కార్మికులకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరింది. చేనేత రంగానికి సంబంధించి 18 ప్రధాన డిమాండ్ల సాధన కోసం 15 చేనేత సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడులో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. చేనేత రంగాన్ని ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలని సమావేశానికి హాజరైన నాయకులు డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిలు విడుదల చేయాలని, రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టుగానే నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, జీఎస్టీని రద్దు చేయాలని, చిలప నూలు, పట్టు, రంగులు, రసాయనాలు సబ్సిడీ ధరలకు అందించాలని, చేనేత రంగానికి పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని, నేతన్నలకు 3 సెంట్ల చొప్పున భూమి ఇచ్చి ఇళ్లు నిర్మించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి సంబంధించిన ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ఫిబ్రవరి 23న చలో మంగళగిరి నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. దీనికోసం రాష్ట్ర చేనేత సంఘాల జేఏసీ ఏర్పాటు చేసింది. జేఏసీ కోకన్వీనర్లుగా బండారు ఆనంద ప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బుధవారపు బాలాజీ, కట్టా దుర్గారావు ఎంపికయ్యారు. సమావేశంలో చేనేత సంఘాల జాతీయ, రాష్ట్ర నేతలు నమాల శివరామప్రసాద్, పిల్లలమర్రి బాలకృష్ణ, దామెర్ల శ్రీకృష్ణ, ముప్పన వీర్రాజు, వీరభద్రేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, చింతా శ్రీనివాసులు, సాయి ఓంకారయ్య, సమతం రమణ మహేష్ మాట్లాడారు.

## నవజాత శిశువులు, చిన్నపిల్లల వైద్యంలో ఆధునిక చికిత్సలు

శిశువులను కాపాడడంలో పిడియాట్రీషియన్లు కీలకపాత్ర

పిడియాట్రిక్ వైద్య సదస్సులో 400 మందికి పైగా వైద్యులు హాజరు



స్వర్ణసాగరం విజయవాడ,

నవజాత శిశువులను కాపాడడంలో వైద్యుల పాత్ర అమోఘమని అను హాస్పటల్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ గాజుల రమేష్ అన్నారు. ఆదివారంనాడు ఎనికేపాడులోని అను మైబేబీలో జరిగిన పిడియాట్రిక్ వైద్య సదస్సుకు రాష్ట్రం నలుమూలలు నుండి 400 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అను మైబేబీ మరియు ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ సౌజన్యంతో జరిగిన వైద్య సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గాజుల రమేష్ మాట్లాడుతూ, నవజాత శిశువుల వైద్యంలో ఎన్నో ఆధునిక మార్పులు సంభవించాయని, సకాలంలో నిపుణులైన వైద్యులను సంప్రదించడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. నేడు వైద్యరంగంలో పెనుమార్పులు సంభవించి ఆధునిక చికిత్సలు అందించడంలో పిడియాట్రీషియన్స్ పాత్ర కీలకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులచే వర్క్‌షాప్ నిర్వహణ, ప్యానెల్ వైద్యులచే గ్రూపు డిస్కర్షన్స్ నిర్వహించారు. సదస్సులో పెద్దఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అను మైబేబీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీదేవి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డైరెక్టర్ కె.రవికుమార్, పిడియాట్రిక్ వైద్య బృందం డాక్టర్ బి.రేవంత్, డాక్టర్ ఎం.ఎన్.శ్వేత, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ జోత్స్న ముత్యాల, డాక్టర్ పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజన్ వైజాగ్‌లో కీలక అడుగు

-మొదటిపేజీ తరువాయి

ఆ రోజు మేం చేసిన కృషి.. ఇవాళ్టి ఈ కీలక మైలు రాయిని చేరుకునేందుకు ముఖ్య కారణంగా నిలిచింది. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన జీఎంఆర్ గ్రూప్‌కు నా హృదయ పూర్వక అభినందనలు. అలాగే, విశాఖపట్నం పోర్టును భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే భోగాపురం ఎయిర్‌పోర్ట్ బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు 2023 మార్చిలో ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారం, కృషి నాకు గుర్తుంది’ అని వైఎస్ జగన్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నేడు ‘స్వచ్ఛ సంక్రాంతి’ గ్రామసభలు

-



మొదటిపేజీ తరువాయి

ఉంచేందుకు సోమవారం అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో చేపట్టిన చర్యలను తెలియజేయడం, ‘ముందు.. తర్వాత ’ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో స్వచ్ఛతను నిరంతర కొనసాగించేందుకు తీర్మానాలు ఆమోదిస్తారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరచిన ప్రతి జిల్లాలోని మూడు పంచాయతీలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్కరించేందుకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు/సాధారణ నిధులను ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం వినియోగించుకోవచ్చు. జిల్లా పంచాయతీ అధికారులు, డీడీవోలు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. ప్రజలు గ్రామసభల్లో పాల్గొని గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని అధికారులు సూచించారు.

## జూన్ నాటికి విమానాశ్రయం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి మిగిలిన 4% పనులూ పూర్తిచేసి విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని వివరించారు. 18 నెలల్లో విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావడానికి కారణమైన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ఆదివారం ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ‘2014–19 మధ్య ఎన్డీయే ప్రభుత్వం దీని నిర్మాణం చేపట్టింది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతానికి అనుసంధానం పెరిగి.. అభివృద్ధికి దోహదపడుతుంది. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, ఐటీ సహా వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ సంస్థల రాకతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయి’ అని చంద్రబాబు పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, విమానాశ్రయ నిర్మాణం వేగంగా సాగడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. భోగాపురం విమానాశ్రయంలో టెస్ట్‌ఫ్లైట్ ల్యాండింగ్ విజయవంతం కావడం హర్షణీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI No : APTEL/2020/13908

# రాజముద్రతో రైతులకు పాస్‌పుస్తకాల పంపిణీ

## రైతుల ముఖాల్లో ఆనంద హరివిల్లు




**తవణంపల్లె, స్వర్ణసాగరం జనవరి-04**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, తవనంపల్లి మండలంలో రాజముద్రలతో కూడిన రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతుల్లో అపారమైన ఆనందాన్ని నింపింది. 2024 ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రలతో కూడిన పాస్‌పుస్తకాలు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చుతూ ప్రస్తుతం ప్రతి రైతుకూ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేస్తుండటంతో రైతుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాజముద్రతో ఉన్న పాస్‌పుస్తకాలను రద్దు చేసి, తన ఫోటోతో ఉన్న పాస్‌పుస్తకాలను జారీ చేయడం వల్ల రైతుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాతలుఉముత్తాతల కాలం నుంచి తమకు వచ్చిన భూములకు రాజకీయ నేత ఫోటోతో పాస్‌పుస్తకం ఇవ్వడంపై అప్పట్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. అదేవిధంగా, అప్పటి ప్రభుత్వంలో నిషేధిత జాబితా (22-ఏ) పేరుతో వందలాది ఎకరాల భూములను జాబితాలో చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేశారని, బ్యాంకు రుణాలు, క్రయవిక్రయాలకు అడ్డంకులు ఏర్పడ్డాయని ఆరోపణలు ఉన్నాయి. కొందరు రైతులు ఈ జాబితా నుంచి తొలగింపుల కోసం డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలూ వినిపించాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం క్యాబినెట్ నిర్ణయంతో వివాదరహితంగా ప్రజల ప్రైవేట్ భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించింది. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా రద్దు చేసి ప్రజల్లో భరోసా నింపింది. ఈ పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, టీడీపీ రైతు నాయకులు, రైతు కార్యదర్శి జైపాల్, బాబు నాయుడు, బీసీ సెల్ నాయకుడు రామచంద్ర, మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రెండవసారి ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షులుగా సిద్ధల శివప్రసాద్

## పదవి కోసం కాదు హక్కుల కోసం పోరాటం అధ్యక్షుడిగా శివప్రసాద్





**రేణిగుంట స్వర్ణ సాగరం జనవరి 04**

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) తిరుపతి జిల్లా శాఖకు సంబంధించిన 2025 ఉ2028 కాలపరిమితి ఎన్నికలు ఆదివారం కలెక్టరేట్‌లో శాంతియుతంగా పూర్తయ్యాయి. ఎన్నికల అధికారి హుస్సేన్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో అన్ని పదవులకు పోటీ లేకుండా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా సిద్దాలా శివప్రసాద్ ఎంపిక కాగా, అసోసియేట్ అధ్యక్షుడిగా సి. జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిద్దాలా శివప్రసాద్ స్పష్టమైన హెచ్చరికలతో మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులపై రోజురోజుకీ పనిభారం పెరుగుతోంది. సిబ్బంది కొరత, భద్రతా లోపాలు, పెండింగ్ ప్రయోజనాలు ప్రభుత్వ దృష్టికి వెళ్లినా పరిష్కారం లేదు. ఇక సహనం లేదు. ఉద్యోగుల హక్కుల కోసం అవసరమైతే రాష్ట్రస్థాయిలో ఉద్యమానికి సిద్ధం అని తేల్చిచెప్పారు. ఉపాధ్యక్షులుగా జయంత్, అన్వర్ బాషా, అజమత్తుల్లా ఖాన్, లావణ్య (మహిళ), కార్యదర్శిగా గోపినాథ్, సంఘటనా కార్యదర్శిగా యశ్వంత్ కుమార్ సి.ఎన్, క్రీడాఉసాంస్కృతిక కార్యదర్శిగా రాఘువర్మ, సహ కార్యదర్శులుగా అఖిల్ కుమార్, సురేంద్ర, సీవీవీఎన్ సిరీష, సురేంద్ర బాబు, ఖజాంచిగా రూప్‌చంద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2025ఉ2028 కాలంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాట బాటలో ముందుకెళ్తుందని సంఘం వర్గాలు తెలిపాయి. నూతన కార్యవర్గానికి సాహబాటు ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిరుపతి డివిజన్ అధ్యక్షులు చంగల్ రాయులు అభినందనలు తెలిపారు.

# డోర్నకల్ లో కాంగ్రెస్ ముందస్తు ఎన్నికల ప్రచారం

## సంక్షమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపిస్తాయి..



**స్వర్ణసాగరం డోర్నకల్ జనవరి 04**

రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్, ఆదేశాల మేరకు ఆదివారం డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షమ పథకాలను పట్టణంలో ఉన్న 15, వార్డులు తిరుగుతూ ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందస్తు ఎన్నికల ప్రచారం చేస్తున్నామని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, మున్సిపల్ మాజీ చైర్మన్ వీరన్న, మైనార్టీ అధ్యక్షులు ఖాదర్ బాబా,తెలిపారు. మొదటి వార్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షమ పథకాలు,పట్టణ అభివృద్ధి కోసం ప్రతి వార్డుకు 50, లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం వర్గ బేధాలు లేకుండా పని చేసి 15, వార్డులో.. క్లీన్ స్వీప్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్, గిఫ్ట్ గా ఇస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మాజీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటి లింగం మాధ శ్రీనివాస్,హరి కృష్ణ, రెడ్డబోయిన శంకర్, మామిడి నాగరాజు, సౌడం మహేష్, మల్లం అనిల్,శీలం శ్రీనివాస్, ఎడమ కంటి రవి, ఫరిద్, ప్రవీణ్ బాబు, ఎరువ పవన్,బి.సత్యనారాయణ,సుశీల్ జైన్, మున్నా, రామకోటి,బుట్టి విజయ్, అశోక్,జోషి,దోమల లక్ష్మణ్, తదితరులు ఉన్నారు

# పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలోసర్వమత ప్రార్ధనలు



**ఇందుకూరుపేట స్వర్ణ సాగరం జనవరి 4**

మండలంలోని పల్లిపాడు గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ మెంబర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆశ్రమ కమిటీ మెంబర్ గంపల. మంజుల మరియు షేక్ అల్లాబక్ష మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రము మరియు నూలుమల సమర్పించారు, అనంతరం ఆశ్రమ స్థలదాత పొనక. కనకమ్మ విగ్రహానికి ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం. దయాకర్ రెడ్డి , నారాయణ పట్టు వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు. అనంతరం గణేశం సుమంత్ రెడ్డి గ్రామస్తులకు మహాత్మా గాంధీ యొక్క ఆశయాల గురించి మరియు ఆశ్రమ స్థల దాత పొనక. కనకమ్మ స్వతంత్ర పోరాటం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ మనోజ్ స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ముగిసిన అమర రాజా 40వ ఫౌండేషన్ డే

## క్రీడలు, ఆటలు, క్రికెట్ టోర్నమెంట్ ల నిర్వాహణ




**రేణిగుంట స్వర్ణ సాగరం జనవరి 04**

అమర రాజా సంస్థ 40వ ఫౌండేషన్ డే సందర్భంగా నిర్వహించిన ఇంటర్ టీమ్ క్రికెట్ టోర్నమెంట్ అత్యంత విజయవంతంగా 2025 నవంబర్ 13న ప్రారంభమై 2026 జనవరి 4న ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్ ద్వారా అమర రాజా సంస్థలోని ఐక్యత, క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ భావన స్పష్టంగా ప్రతిబింబించాయి.ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొని, 39 ఉత్కంఠభరిత మ్యాచ్‌లను ఆడాయి. ప్రతి మ్యాచ్‌లోనూ ఆటగాళ్లు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రేక్షకులను అలరించారు. ఫైనల్ మ్యాచ్‌ను గుల్మోహర్, డాలియా జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచిన గుల్మోహర్ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన డాలియా జట్టు ధైర్యంగా ఆడి, 19.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకొని ఉత్కంఠభరిత విజయం సాధించింది. ఈ విజయంతో డాలియా జట్టు ఛాంపియన్‌గా నిలిచి, అమర రాజా క్రికెట్ టోర్నమెంట్ చరిత్రలో 7వ టైటిల్‌ను సాధించింది. ఇది ఇప్పటివరకు ఏ జట్టుకైనా లభించిన అత్యధిక టైటిళ్ల సంఖ్య కావడం విశేషం. దీంతో డాలియా జట్టు అమర రాజా క్రికెట్ చరిత్రలో తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరచుకుంది. ముగింపు కార్యక్రమం, బహుమతి ప్రదానోత్సవానికి అమర రాజా సంస్థకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఎం. మునీశ్వర నాయుడు ఉ ఆపరేషన్స్ హెడ్, ఏ ఎస్ బీ యూ, ఎం. శ్రీనివాస రావు ఉ ఆపరేషన్స్ హెడ్, ఐ ఎస్ బీ యూ, మురళి ఉ ఏ ఆర్ ఈ ఎ ఎం క్యూ పీ సీ హెడ్, మంజునాథ్ ఉ చైర్మన్, ఫౌండేషన్ డే, ఫ్యామిలీ డే కార్యక్రమం, చంద్రబాబు డి ఉ కో-చైర్మన్, ఫౌండేషన్ డే, ఫ్యామిలీ డే కార్యక్రమం, భరత్ రాటకొండ ఉ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోఆర్డినేటర్. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లు, జట్లకు వివిధ బహుమతులు అందజేశారు. అందులో ముఖ్యంగా:మాన్ ఆఫ్ ది మ్యాచ్,ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్,టోర్నమెంట్ బెస్ట్ బ్యాటర్,టోర్నమెంట్ బెస్ట్ బౌలర్,టోర్నమెంట్ బెస్ట్ ఫీల్డర్,ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్, రన్నర్-అప్ ట్రోఫీ,విజేత ట్రోఫీ, ఈ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగియడం ద్వారా, ఉద్యోగుల ఆరోగ్యం, స్నేహభావం మరియు క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంలో అమర రాజా సంస్థ యొక్క నిబద్ధత మరోసారి స్పష్టమైంది. 40వ ఫౌండేషన్ డే క్రీడలు, ఆటలు ప్రతి ఒక్కరికీ చిరస్థాయిగా గుర్తుండిపోయే వేడుకగా నిలిచాయి.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# విలుకాని పల్లెలో లక్ష్మపురం వాసులకు భారత్ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

## గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పావని కృషి





**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జనవరి 4**

మండలంలోని విలుకానిపల్లి పంచాయతీ ఏకే నగర్ లక్ష్మపురం వాసులకు భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అర్హులైన 15 మందికి పీఎం ఉజ్వల యోజన పథకం ద్వారా అందించారు. ఈ గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయించడంలో స్థానిక సర్పంచ్ గోపిరెడ్డి పావని చైతన్య జ్యోతి సభ్యురాలు పద్మావతి కృషి కారణంగా తమకు గ్యాస్ కనెక్షన్లు రావడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పావని మాట్లాడుతూ రేషన్ కార్డు ఉండి ఎవరికైనా గ్యాస్ కనెక్షన్ లేని పక్షంలో వారికి వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్ పంచాయతీ సెక్రెటరీ మురళి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సుర కత్తి శ్రీనివాసులు గ్రామ ప్రధాన కార్యదర్శి సోడం నరేంద్ర మల్లికార్జున లబ్ధిదారులు పాల్గొన్నారు

# అక్కంపేట నేతకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి

## ముళ్ళ కిరీటం నెత్తిన పెట్టుకున్న కిరణ్ కుమార్ రెడ్డి



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జనవరి 4**

మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన నేత నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి కి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి లభించడాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు అభినందిస్తున్నారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఆయా మండలాలలో సమర్థవంతమైన నాయకులు లేకపోవడం తో ఆ పార్టీపై అభిమానం ఉన్న పాత తరం తో పాటు కొత్తతరం నేతలు కార్యకర్తలు నిరుత్సాహానికి గురై ఉన్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు దీటైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ప్రముఖులు ఆనం సంజీవరెడ్డి సివి శేషారెడ్డి దేవకుమార్ రెడ్డి లాంటి వారు సారధ్యం చేసిన ఈ పదవి నిజంగా ముళ్ళ కిరీటంగా భావించవచ్చు. ప్రస్తుత డిసిసి అధ్యక్షనిగా ఎంపికైన కిరణ్ కుమార్ రెడ్డి బాల్యం నుంచి క్రమశిక్షణ గల నేతగా క్రియాశీలక రాజకీయాలలో చురుకుగా పనిచేస్తూ ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న సామెతకు అనుగుణంగా అక్కంపేట గ్రామానికి తన తల్లి సర్పంచిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ పై అభిమానం పుష్కలంగా ఉండడంగత అసెంబ్లీ ఎన్నికలలో కోవూరు నుంచి పోటీ చేయడం ద్వారా సుపరిచితునిగా గుర్తింపు పొందారు.ఆయనకు పలువురితో రాజకీయ మైత్రి కూడా తోడుగా ఉంది. మొదట . జిల్లావ్యాప్తంగా ఆయా మండలాలలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి యువకులైన వారికి బాధ్యతలు అప్పగించేలా చర్యలు చేపట్టగలిగితే తిరిగి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం చేకూర గలదన్న ఆశాభావాన్ని కాంగ్రెస్ పార్టీ అభిమానులు వ్యక్తం చేస్తున్నారు

# పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జనవరి 4**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి తండ్రిపి.సదాశివరెడ్డి

పెద్దకర్మ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొని నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం వైఎస్సార్ పార్టీ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్,పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి,పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే లలిత థామస్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, బంగారుపాళ్యం మండలం పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి,రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి ప్రభు నాయుడు, రాష్ట్ర సోషియల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి,జిల్లా ట్రేడ్ యునియన్ ఉపాధ్యక్షుడు అన్ను,నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు పాలాక్షరెడ్డి,మండల రైతు విభాగం అధ్యక్షులు అరుణామల్ రెడ్డి,మండల ట్రేడ్ యునియన్ అధ్యక్షుడు రియాజ్,యువ నాయకులు భాష్యం లోకేష్ చౌదరి,సల్మాన్ తదితరులు నివాళులు అర్పించారు.

ప్రశ్నించడం - ప్రజాస్వామ్యానికి బలం RNI No : APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# కలెక్టర్ సార్ శ్రీకాళహస్తి మండలానికి తహసిల్దార్‌ను నియమించండి!

### మండల ప్రజల తరపున బర్రి హేమభూషణ్ రెడ్డి విజ్ఞప్తి,
### తహసిల్దార్ లేక రెండేళ్లుగా రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం,
### పేరుకుపోతున్న ప్రజా సమస్యలౌ డీటీలు ఆదాయ సర్టిఫికెట్లకే పరిమితం,



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి,

శ్రీకాళహస్తి మండలానికి తక్షణమే రెగ్యులర్ తహసిల్దార్‌ను నియమించాలని శ్రీకాళ హస్తి మండలం వైఎస్సార్సీపీ మాజీ మండల అధ్యక్షుడు, తొండమాన్‌పురం సర్పంచ్ బర్రి హేమభూషణ్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆదివారం తొండమాన్‌పురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద మండలాల్లో ఒకటైన శ్రీకాళహస్తికి రెగ్యులర్ తహసిల్దార్ లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్ల వ్యవధిలో ఇప్పటికే ఇద్దరు తహసిల్దార్లు బదిలీపై వెళ్లిపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.తహసిల్దార్ లేకపోవడంతో కార్యాలయంలోని డిప్యూటీ తహసిల్దార్లను ఇన్‌చార్జ్‌లుగా కొనసాగిస్తున్నారని, దీంతో కీలకమైన రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. పీజీఆర్ఎస్, స్పందన, ప్రజా దర్బార్ ద్వారా వచ్చే ఫిర్యాదులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయని, ఫలితంగా ప్రజలు కార్యాల యాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు.ప్రస్తుతం డిప్యూటీ తహసిల్దార్లు కేవలం ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకే పరిమితమైపోయారని, భూవివాదాలు, రెవెన్యూ సంబంధిత కీలక అంశాలు పూర్తిగా పక్కన పడిపోయాయని తెలిపారు. ఇప్ప టికైనా జిల్లా కలెక్టర్ స్పందించి శ్రీకాళహస్తి మండలానికి రెగ్యులర్ తహసిల్దార్‌ను నియమించి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని బర్రి హేమభూషణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సమాజానికి హిందూ ధర్మం ఆచారాలు అవసరం

### హిందూ సమ్మేళనంలో రామాయణం మహేష్ స్వామి




బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణసాగరం జనవరి 4

సమాజానికి హిందూ ధర్మం ఆచారాలు అవసరమని ఆశ్రమ నిర్వాహకులు మహేష్ స్వామి పేర్కొన్నారు ఆదివారం బైపాస్ రహదారిలో జరిగిన హిందూ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని తన సందేశాన్ని అందించారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ఆచార వ్యవహారాలు వివరించారు. హిందువులను చైతన్య పరిచే విధంగా సమ్మేళనం జరగడం శుభ పరిణామన్నారుఆర్ఎస్ఎస్ నెల్లూరు ప్రచారక్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 40 ప్రాంతాలలో ఈ సమ్మేళనాలు నిర్వహించడం జరిగిందన్నారు ఈ సమ్మేళనంలో అధిక సంఖ్యలో హిందూ బంధువులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కేతరాజు కేశవయ్య బాలు సుబ్బారావు వి రవి వెంకట నాథఎన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# డక్కిలిలో ఉచిత వైద్యశిబిరం

### ఎంప్లాయిస్ జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ ఉచితం
### కిడ్నీ సంబంధిత బాధితులకు ఉచిత దయాలసిస్ చేయబడును




స్వర్ణ సగరం ప్రతినిధి డక్కిలి

నేడు సోమవారంతిరుపతి జిల్లా డక్కిలి మండలంలో రమణ ప్రథమ చికిత్స కేంద్రం కరెంట్ ఆఫీస్ పక్కన కమ్మపల్లి రోడ్డు నందు తిరుపతి రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరము ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించబడును.ఆధునిక పద్ధతి ద్వారా కోత కుట్టు లేకుండా లేజర్ మరియు లేపారో స్కోపీ పద్ధతి ద్వారా ఉచిత ఆపరేషన్ చేయబడును. ముఖ్యంగా ఎంప్లాయ్ హెల్త్ స్కీం మరియు జర్నలిస్ట్ హెల్త్ స్కీం ద్వారా అర్హులైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడును. మండలంలో ప్రజలకు కిడ్నీ సమస్యలు ఉంటే సంబంధిత బాధితులకు ఉచితంగా దయాలసిస్ చేయబడును తెలియజేశారు. నెఫ్రాలజీ, యూరాలజీ,న్యూరాలజీ,ప్లాస్టిక్ సర్జరీ,ఎముకల కీళ్లు, జనరల్ మెడిసిన్,జనరల్ సర్జరీ విభాగం ద్వారా అన్ని రకాల జబ్బులకు చూడబడును. ఈ సదవకాశాన్ని డక్కిలి మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డక్కిలి ఆర్.ఎం.పీ డాక్టర్ రమణ కోరారు.

# గణనాథుని సేవలో చిత్తూరు ఎస్పీ తుషార్ డ్యూడీ



కాణిపాకం, స్వర్ణ సాగరం జనవరి 4

కానిపాక స్వామివారిని దర్శించుకున్న చిత్తూరు ఎస్పీ తుషార్ డ్యూడీ .కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్న చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్.ఐ నరసింహులు, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి సంక్షమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం.







### మామ సోమిరెడ్డి ద్వారా కోట్లాది పనులు
### గిరిజన కాలనీలలో దుప్పట్లు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన శృతి రెడ్డి

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం జనవరి 4

సర్వేపల్లి నియోజకవర్గం లో ఒకటిన్నర సంవత్సరాల కాలంలో మామ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ద్వారా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగినట్లు సోమిరెడ్డి శృతి రెడ్డి తెలిపారు. మండలంలోని పోట్లపూడి వెంకన్నపాలెం విలుకానిపల్లి గిరిజన కాలనీలలో ఆదివారం దుప్పట్లు విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడూరు ప్రాంతంలో రూ 70 లక్షలతో సిసి రోడ్లు 36 లక్షలతో ఆరోగ్య కేంద్రం మూడు కోట్ల 65 లక్షలతో బీచ్ రోడ్ అభివృద్ధి 16 కోట్ల 70 లక్షలతో కాలువల మరమ్మత్తులు ఎనిమిది లక్షలతో సైడ్ కాలవలు ఇతర అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు వెంకన్నపాలెం గిరిజన కాలనీలో విద్యార్థులు ఆడుకునేందుకు ప్లేగ్రౌండ్ అదే విధంగా దేవాలయ నిర్మాణం కోరారని ఈ విషయాలను మామ దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామన్నారురానున్న పంచాయతీ ఎన్నికలలో స్థానిక నేతలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమాలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర మండల పార్టీ అధ్యక్షులు కొణతం రఘు బాబు ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర సీనియర్ నాయకులు టిడిపి నేతలు ఈదూరుభాస్కరయ్యభరత్ రెడ్డి గిరీష్ వెంకటరమణయ్య శీనమ్మ గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్ శ్రీకుమార్ రెడ్డి సుస్మితా రెడ్డిచింతాసీతారామయ్య సుమన్‌పా మంజిరామకృష్ణవెంకటేశ్వర్లు పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పిల్లల చేతుల్లో గీత భవిష్యత్‌లో విలువలు,

### పాఠ్యాంశాలకే కాదౌ జీవితానికీ మార్గదర్శకంగా భగవద్గీత,

స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,

పరీక్షల మార్కులకే పరిమితమవుతున్న విద్యా విధానంలో, పిల్లల వ్యక్తిత్వ వికాసం ఉ నైతిక విలువలు ఉ భారతీయ సంస్కృతి బోధన ఎక్కడ అనే ప్రశ్నకు సమాధానంగా నిలుస్తోంది భగవద్గీత. ఆ భావనను ఆచరణలోకి తీసుకువస్తున్నారు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి."పిల్లలు మంచి ఉద్యోగాలు సంపాదించాలి కానీ అంతకంటే ముందు మంచి మనుషులుగా తయారవ్వాలి" అన్నదే తన లక్ష్యమని మునికృష్ణారెడ్డి చెబుతున్నారు. అందులో భాగంగానే భగవద్గీతను విద్యార్థుల పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలన్న ఆలోచనకు రూపం ఇచ్చారు.

ఆదివారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సరళమైన తెలుగులో రూపొందించిన భగవద్గీత ప్రతులను ఉచితంగా అందజేశారు. "ప్రతి ఒక్కరూ చదవగలిగేలా, అర్థం చేసుకునేలా గీత ఉండాలి" అన్నదే తన ఆలోచనగా తెలిపారు.భగవద్గీత చదివే విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధర్మబద్ధమైన జీవన దృక్పథం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పరీక్షల ఒత్తిడి, పోటీ ప్రపంచంలో అయోమయంలో పడుతున్న యువతకు గీత బోధన ఒక మానసిక దిశానిర్దేశకంగా పని చేస్తుందని అన్నారు.భారతీయ సంస్కృతి విలువలు, నైతికత, బాధ్యత భావం విద్యార్థుల్లో నాటే శక్తి భగవద్గీతలో ఉందని, అందుకే ప్రతి విద్యార్థి గీతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంతోనే ఆగకుండా, భగవద్గీతను స్వీకరించిన విద్యార్థుల కోసం త్వరలో గీతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి,



ఆలోచనలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. "గీత పుస్తకం కాదౌ జీవితానికి దారి చూపే దీపం" అని మునికృష్ణారెడ్డి మాటలు ఈ ప్రయత్నానికి సారాంశంగా నిలుస్తున్నాయి.

# ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

-కౌన్సిలర్ పాలేటి నాగార్జున

### అణగారిన వర్గాల వారి బాధ అధికారుల కు కనిపించవా..!
### అగ్ర కులాల ఘోషా అధికారులకు వినిపించదా.....!
### ఎన్ఎస్ఆర్ కాలనీ దళితవాడు అధికారులకు కనిపించదా...!




స్వర్ణ సాగరం(నాయుడుపేట) జనవరి 04.

నాయుడుపేట పట్టణం 2వ వార్డు ఎన్ ఎస్ ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ పాలేటి నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన ఎంఎస్ఆర్ కాలనీ వద్ద ఉన్న రైల్వే గేట్ను పరిశీలించారు. ఈ సందర్భంగా అకౌన్సిలర్ పాలేటి నాగార్జున మాట్లాడుతూ ఎన్ఎస్ఆర్ కాలనీ గేటు దాటుతూ ఒక వ్యక్తి మృతి చెందారని తెలిపారు.రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని అనేకసార్లు రైల్వే అధికారులకు వింత పత్రాలు సమర్పించినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. అన్న సార్ కాలనీ వద్ద రైల్వే గేట్ మూసివేయడంతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య రైల్వే అధికారులతో చర్చించి ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద గల రైల్వే గేటును మూసి వేయకుండా గేటు మూసివేయకుండా వెళ్లిపోయారని తెలిపారు.ఇటీవల గేటు మూసివేయడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.రైల్వే అధికారులు వెంటనే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి కాలనీ వాసుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

# రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ను సన్మానించిన జర్నలిస్టులు

రేణిగుంట స్వర్ణ సాగరం జనవరి 04



ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ను రేణిగుంట జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఆదివారం కలెక్టరేట్లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఎన్నికల్లో అధ్యక్షుడిగా కలెక్టరేట్ తాసిల్దార్ శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శివప్రసాద్ ను రేణిగుంట జర్నలిస్టుల శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శివమూర్తి, రమేష్, రాజశేఖర్, కిరణ్, వినోద్, నాగేంద్ర, చందు. మధు, బాషా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల ఉద్యోగుల పోరాటం ఉధృతం,

### 5 నుంచి 9 వరకు రిలే నిరాహార దీక్షలు,
### జనవరి 6న విజయవాడకు తరలిరావాలి: పప్పు చిరంజీవి రెడ్డి,



స్వర్ణ సాగరం ---తొట్టంబేడు,

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నెల రోజులుగా ఆందోళనలు, సమ్మెలు నిర్వహి స్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ, సంబంధిత అధికారులు గానీ ఇప్పటివరకు చర్చలకు కూడా పిలవకపోవడం తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది.ఈ పరిస్థితిలో యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని నిర్ణయిం చినట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు జనవరి 6వ తేదీన విజయవాడలో నిర్వహించే రిలే నిరాహార దీక్షకు భారీ సంఖ్యలో తరలిరావాలని తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పప్పు చిరంజీవి రెడ్డి పిలుపునిచ్చారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని, అందరూ ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు.

# కూటమి ప్రభుత్వం మళ్లీ రావాలని శబరిమల కి సైకిల్ యాత్ర పాండు

### ఏపీ ముఖ్యమంత్రిగా మరోసారి నారా చంద్రబాబు అవ్వాలి పాండు

కాణిపాకం స్వర్ణ సాగరం జనవరి 4



మళ్లీ కూటమి ప్రభుత్వం రావాలి కొండయ్య ఎమ్మెల్యే మరోసారి అవ్వాలి పాండు అయ్యప్ప స్వామి భక్తుడు చీరాల. కాణిపాకం చీరాల నుండి శబరిమల కి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి భక్తుడు చీరాల పాండు, 2029 లో నిర్వహించనున్న ఎన్నికల్లో మరోసారి కూటం ప్రభుత్వం ఘనవిజయంగా తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని, మరోసారి చీరాల ఎమ్మెల్యేగా కొండయ్య యాదవ్ అవ్వాలని చీరాల నుండి శబరిమలైకి సైకిల్ యాత్రతో బయలుదేరిన పాండు చీరాల అయ్యప్ప స్వామి భక్తుడు, సైకిల్ యాత్రలో భాగంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని ఆలయం నుండి సైకిల్ పై శబరిమలై కి బయలుదేరిన అయ్యప్ప స్వామి భక్తుడు పాండు. ఈ కార్యక్రమంలో పాండుకి ధన్యవాదాలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ నాయకుడు అరగొండ వెంకటేష్ యాదవ్, జనసేన నాయకులు చిత్తూరు ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ఏపీ శివయ్య, పూతలపట్టు నియోజకవర్గం జనసేన పార్టీ ఐ టి కోఆర్డినేటర్ ముదిగోళం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# రాయుడు హత్య కేసులో ట్విస్టులపై ట్విస్టులు

## నిర్ధోషులుగా బయటపడతాం: వినుత కోటా భర్త కోట చంద్రబాబు

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్/శ్రీకాళహస్తి:

రాయుడు హత్య కేసులో తాము పూర్తిగా నిర్దోషులమని, సత్యం తప్పకుండా బయటకు వస్తుందని బహిష్కృత జనసేన మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత కోట భర్త కోట చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన వీడియో ద్వారా మీడియాకు వివరాలు వెల్లడించారు. రాయుడు హత్య కేసులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది త్వరలోనే తేలుతుందని పేర్కొన్నారు. తాము రిమాండ్‌కు వెళ్లకముందే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడమే తమకు బెయిల్ మంజూరుకు ప్రధాన ఆధారంగా మారిందని తెలిపారు.అనుమానాలపై ప్రశ్నలుశ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి, తమిళనాడు పోలీస ులతో మంతనాలు జరిపిన తీరు వెనుక అసలు అంతరార్థం ఏమిటో బయటపడాల్సి ఉందన్నారు. అలాగే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఒకసారి "డ్రైవర్ తెలియదు" అని, మరోసారి "తమ్ముడు లాంటి వాడు" అని చెప్పడం చూస్తే హత్య కేసులో నిజాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు.రాయుడు అంత్యక్రి



యలను తానే తన సొంత డబ్బులతో చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే, ఆ కార్యక్రమాలకు ఎందుకు హాజరు కాలేదని కోట చంద్రబాబు ప్రశ్నించారు.

**సీబీసీఐడీ విచారణకు డిమాండ్**

ఈ హత్య కేసును సీబీసీఐడీ ద్వారా విచారించాలి అని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి నుంచి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో, పది సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో శవాన్ని ఉంచడం చూస్తే ఈ హత్య ఎంత ప్రణాళికాబద్ధంగా జరిగిందో స్పష్టమవుతోందని అన్నారు.ఒక మహిళను రాజకీయంగా సమాధి చేయడానికి ఇంత పెద్ద కుట్ర అవసరమా? అని ప్రశ్నించారు. తాము చేయని నేరానికి ఇరుక్కొన్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ కేసులో ఎలా నిర్దోషిగా బయటపడ్డారో, అదే తరహాలో ఈ కేసులోనూ తాము బయటపడతామని ధీమా వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే స్పందన...**ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఇప్పటికే పలు మార్లు మీడియాతో మాట్లాడుతూ రాయుడు హత్య కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని స్పష్టం చేశారు. రాయుడు పేరుతో విడుదలైన వీడియోలు ఏఐ ద్వారా సృష్టించినవే అని కూడా వెల్లడించారు.

**తమిళనాడు పోలీసుల దర్యాప్తు...**రాయుడు హత్య కేసులో తమిళనాడు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటికే జనసేన, టీడీపీకి చెందిన పలువురు నేతలను లోతుగా విచారించారు. మరో వారం రోజుల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కూడా విచారించే అవకాశం ఉందన్న సమాచారం చర్చనీయాంశంగా మారింది.

**ముగింపు...**మొత్తం మీద రాయుడు హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తమిళనాడు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తుండటంతో, అసలు నిజం ఏమిటన్నది త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ డైరీ ఆవిష్కరించిన డాక్టర్ కే పద్మావతి





కాణిపాకం స్వర్ణ సాగరం డిసెంబర్ 4

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా 2026వ సంవత్సరం క్యాలెండర్, డైరీ, ఆవిష్కరించిన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వైద్య అధికారి కే పద్మావతి. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ 2026వ సంవత్సరం డైరీ క్యాలెండర్ ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టీ.డి. సుధారాణి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. వెంకటప్రసాద్, చిత్తూరు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, డిఎంహెచ్ఓ ఆఫీస్ సూపర్డెంట్ గిరిధర్ రెడ్డి, అధ్యక్షులు వి శివయ్య, మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి ని కలిసి సన్మానించిన డాక్టర్ జనార్ధన్ రాష్ట్ర నర్సింగ్ హోమ్ల జాయింట్ సెక్రటరీ మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మ ఎదుర్కొంటున్న సమస్యలను డైరెక్టర్ కి విన్నవించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ అన్వేష్ మునిసిపల్ వైద్యాధికారి వైద్య సిబ్బంది రత్నాకర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# డక్కిలి బస్టాండ్ నందు చెత్త విషయంలో స్పందించిన టిడిపి నాయకులు





స్వర్ణ సగరం ప్రతినిధి డక్కిలి

తిరుపతి జిల్లా డక్కిలి మండలం, డక్కిలి బస్టాండ్ నందు చెత్త విషయంలో స్పందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు డక్కిలి బస్టాండ్ లో చుట్టుపక్కల వాళ్ళు బస్టాండ్ లోపల చెత్త వెయ్యడం వలన భయంకరమైన దుర్వాసన పాటు దోమలు రోగాలు వస్తుంటే దీనికి స్పందించిన డక్కిలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి నారాయణరెడ్డి సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు డక్కిలి బస్టాండ్ లోని చెత్త నంతా జే సి పి ట్రాక్టర్ల సహాయంతో శుభ్రం చెయ్యడం జరిగింది అయితే అక్కడున్న నివాస వాసులు మాట్లాడుతూ మనం ఇంక మీదట చెత్త వేయకుండా ఉండాలని అలా వేయడం వల్ల దుర్వాసన తో పాటు దోమలు రోగాలు వస్తాయని వేడుకున్నారు చంద్ర రెడ్డి మాట్లాడుతూ డక్కిలి హెడ్ క్వార్టర్ నందు ఉన్న బస్టాండు చుట్టు పక్కల గ్రామస్తులు వచ్చినప్పుడు బస్టాండ్ లో సేద తీర్చుకునే వాళు ౖ అలాంటిది ఇప్పుడు ఇలా చెత్త లు వెయ్యడం వల్లన బస్టాండ్ ఒక డంప్ యాడ్ లాగా మారిపోయింది అయితే చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులు మరియు నివాసం ఉంటున్న వారు ఇక మీదట చెత్త వెయ్యకుండ ఉండాలని బస్టాండ్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు అయితే ఇక మీదట చెత్త వేస్తే మనకి హాని అని హెచ్చరించారు కాబట్టి బస్టాండ్ చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మనకు వుందని తెలియజేశారు.

# ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్ ని కలిసిన ఐరాల జడ్పిటిసి సుచిత్ర







ఐరాల , స్వర్ణ సాగరం జనవరి 4

బోయకొండ గంగమ్మ ను దర్శించుకున్న ఐరాల జడ్పిటిసి సుచిత్ర కన్నయ్య నాయుడు. ఆదివారం బోయకొండ గంగమ్మ తల్లి కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఐరాల జడ్పిటిసి సుచిత్ర కన్నయ్య నాయుడు, అమ్మవారి తీర్థప్రసా దలనందుకున్నారు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ని బోయకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

# కాణిపాక ఆలయం వద్ద విస్తృత తనిఖీలు చైర్మన్ ఈవో



కాణిపాకం, స్వర్ణ సాగరం జనవరి 4

కాణిపాక ఆలయ వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించిన ఆలయ చైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , ఈ.వో పెంచల కిషోర్ , ఆదివారం లడ్డు పోట్టు నందు విస్తృత తనిఖీలు నిర్వహించి లడ్డు రుచిని మరింత పెంచే విధంగా లడ్డు తయారీలో కొత్త విధానాన్ని తీసుకురావడానికి దగ్గరుండి తయారీ నిర్వహించడం జరిగింది, స్వామివారి ప్రసాదాన్ని రుచిని మరింత పెంచేలాగా తయారు చేయాలని కాంట్రాక్టర్ కి సిబ్బందికి సూచించారు, ఈ కార్యక్రమంలో ఇంచార్జి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా నిర్మాత కొణిదెల సుస్మితని కలిసిన జనసేన నాయకులు





ఐరాల, స్వర్ణసాగరం డిసెంబర్ 4

తెలుగు సినీ నిర్మాత కొణిదల సుస్మితని కలిసిన జనసేన నాయకులు. ఐరాల ఆదివారం తిరుపతికి విచ్చేసిన తెలుగు మన శివశంకర్ వరప్రసాద్ పండగకి వస్తున్నారు సినీ నిర్మాత కొణిదల సుస్మితని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన చిత్తూరు జిల్లా అఖిలభారత చిరంజీవి యువత అధ్యక్షులు పూల ప్రభాకర్, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మట్టపల్లి మునిరాజులు, అనంతరం దుశ్యాలవ తో ఘనంగా సన్మానించారు , ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళ ధనలక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాణి చారిటబుల్ ట్రస్ట్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మెడికల్ క్యాంపు



కాణిపాకం స్వర్ణ సాగరం జనవరి 4

శ్రీ వాణి చారిటబుల్ ట్రస్ట్ చిత్తూర్ వారి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మెడికల్ క్యాంప్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం బస్టాండ్ నందు శ్రీవాణి చారిటబుల్ ట్రస్ట్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు మరియు పరిసర గ్రామస్తులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది, ఈ మెడికల్ క్యాంపును ప్రారంభించిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, సురేష్, స్థానిక ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాక స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్ కు విరాళం

## సూపర్డెంట్ కోదండపాణి కీ విరాళం అందజేస్తున్న దాతలు




కాణిపాకం స్వర్ణ సాగరం జనవరి 4

కాణిపాక గో సంరక్షణ ట్రస్టుకు విరాళం.కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం గో సంరక్షణ ట్రస్ట్ కి విరాళం 1,00,116 రూపాయలు, (చెక్కు) ను దాత రాజన్న నాయుడు , వారి కుటుంబ సభ్యులు, బెంగళూరు వాస్తవ్యులు, ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి,తదితరులు ఉన్నారు.




## మెగా బ్లాస్ట్..
## చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' ట్రైలర్ విడుదల

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి, స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ఈరోజు తిరుపతిలో గ్రాండ్‌గా విడుదల చేసింది. ట్రైలర్ అంతటా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి టైమింగ్ హైలైట్‌గా నిలిచాయి. చిరంజీవి తన వింటేజ్ కామెడీ అండ్ యాక్షన్ మేనరిజమ్స్‌తో అభిమానులను అలరించారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రైలర్ చివరిలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశం థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయమని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయింది.




## 'పుష్ప-2' రికార్డు దిశగా అడుగులు.. 800 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్'!


బాలీవడ్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సృష్టించిన సునామీ ఇంకా ఆగడం లేదు. బాలీవుడ్ చరిత్రలో మరే ఇతర హిందీ సినిమాకు సాధ్యం కాని రీతిలో ఈ చిత్రం సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. విడుదలైన ఐదో వారంలో కూడా మంచి కలెక్షన్లు సాధిస్తున్న ఈ సినిమా తాజాగా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ. 800 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టింది. దీంతో భారతీయ సినీ పరిశ్రమలో ఒక హిందీ సినిమా రూ. 800 కోట్ల మైలురాయిని అందుకున్న చిత్రంగా ధురంధర్ రికార్డులకెక్కింది. అలాగే ప్రస్తుతం బాలీవుడ్ మార్కెట్‌లో 'పుష్ప 2' (హిందీ వెర్షన్) అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు 'ధురంధర్' సాధిస్తున్న వసూళ్ల వేగాన్ని చూస్తుంటే అతి త్వరలోనే 'పుష్ప 2' లైఫ్ టైమ్ బిజినెస్ రికార్డును ధురంధర్ అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో హిందీ బెల్ట్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన నంబర్ వన్ చిత్రంగా అవతరించేందుకు 'ధురంధర్' కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది.

## సత్య 'జెట్లీ' గ్లింప్స్ రిలీజ్.. ఈ సారి కామెడీ మామూలుగా ఉండదు!




'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. సత్య, రియా సింఘా, వెన్నెల కిషోర్, అజయ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని నిర్మాత చెర్రీ తెలిపారు. 'మత్తు వదలరా' సిరీస్ తర్వాత వస్తున్న ఈ సినిమా, ప్రేక్షకులకు మరోసారి నాన్-స్టాప్ వినోదాన్ని పంచుతుందని దర్శకుడు రితేష్ రానా ధీమా వ్యక్తం చేశారు. ఇక వేసవి కానుకగా 'జెట్లీ' థియేటర్లలో సందడి చేయనుంది.

## బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్ 'శంబాల'.. హిందీ ట్రైలర్ రిలీజ్




టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసుందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నాటి నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) చిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబోతే, పాలకు బదలు రక్తం కారుతుంటుంది. ఆ ఆవుని చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊరి జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు. అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.



## పార్టీలకు పర్యాయపదంగా మారిన ఓర్రీ..
## సెలబ్రిటీ సర్కిల్స్‌లో ఎందుకంత క్రేజ్?

ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి పేరు ఇప్పుడు బాలీవుడ్ పార్టీ కల్చర్‌కు సరికొత్త గుర్తింపుగా మారిపోయింది. స్టార్స్, గ్లామర్ భామలు, యంగ్ హీరోలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఓర్రీ తప్పకుండా ఉంటాడన్న మాట వినిపిస్తోంది. సెలబ్రిటీ పార్టీల్లో అతడి హాజరు అంటే ఫన్, హడావిడి, అన్‌ఎక్స్‌పెక్టెడ్ మూమెంట్స్ ఉంటాయనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా ఉంది. ఓర్రీ కెరీర్ విషయానికి వస్తే.. రిలయన్స్ సంస్థలో జాబ్ చేస్తూనే, నైట్ పార్టీలతో మరో వైపు ఆదాయం సంపాదించడం అతడి ప్రత్యేకతగా చెప్పుకుంటారు. ఈవెంట్స్, ప్రైవేట్ పార్టీల్లో అతడి ప్రెజెన్స్‌కు భారీ డిమాండ్ ఉంది. ఒక్కో ఈవెంట్‌కు లక్షల రూపాయల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటాడన్న టాక్ చాలాకాలంగా నడుస్తోంది. ఉద్యోగం కంటే కూడా ఈవెంట్ల ద్వారానే ఎక్కువ సంపాదన ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. అసలు ఓర్రీకి ఇంత క్రేజ్ ఎందుకంటే.. అతడు ఉన్న చోట ఎప్పుడూ సరదా వాతావరణం ఉంటుంది. జనాలను ఆటపట్టించడం, సరదాగా టీజ్ చేయడం, కాస్త ఇర్రిటేట్ చేసినట్టే కనిపించినా చివరకు నవ్వులు పూయించడం అతడి స్టైల్. అందుకే పార్టీ క్రౌడ్స్ అతడిని తెగ ఇష్టపడతారనే మాట వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో అతడి ఫ్యాషన్ సెన్స్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇక తాజాగా ఓ నైట్ పార్టీలో ఓర్రీ చేసిన పనికి అక్కడున్నవాళ్లంతా షాక్ అయినట్టు తెలుస్తోంది. సెల్ఫీల పేరుతో ఆడా, మగా తేడా లేకుండా అందరినీ హగ్ చేసుకుంటూ, కొందరికి స్వీట్ కిస్ ఇవ్వడంతో పార్టీలో చర్చనీయాంశంగా మారాడు. ఈ ఘటనలో తెలుగు నటుడు హర్షవర్ధన్ రాణే, నటి మౌని రాయ్ వంటి సెలబ్రిటీలు కూడా ఉన్నారట. కొందరికి ఇది ఫన్‌గా అనిపించగా, మరికొందరికి మాత్రం అనూహ్యంగా అనిపించిందని సమాచారం. ఇదిలా ఉండగా, ఓర్రీ త్వరలో నటుడిగా మారబోతున్నాడనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఇప్పట్లో అతడు పూర్తిగా ఇన్‌ఫ్లూయెన్సర్ కెరీర్‌పైనే ఫోకస్ పెట్టాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో నటనలోకి వస్తే హీరోగా కాకుండా, తనకు సెట్ అయ్యే క్యారెక్టర్ లేదా కామెడీ రోల్స్‌తో ఎంట్రీ ఇవ్వవచ్చని టాక్. మొత్తానికి, ఓర్రీ పేరు ఇప్పుడు సినిమాల కంటే పార్టీల్లోనే ఎక్కువగా వినిపిస్తోంది. సెలబ్రిటీ కల్చర్‌లో అతడు సృష్టిస్తున్న హడావిడి చూసి, రాబోయే రోజుల్లో అతడి క్రేజ్ ఇంకెంతవరకు వెళ్తుందో చూడాలని ఇండస్ట్రీ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.